క్లుప్తంగా

లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలి

సూర్యాపేటటౌన్ : జాతీయ మెగా లోక్ అదాలత్‌ను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని ఎస్పీ నరసింహ శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. శనివారం జాతీయ మెగా లోక్ అదాలత్ ఉన్నందున సివిల్ తగాదా కేసులు, ఆస్తి విభజన, కుటుంబ పరమైన, వైవాహిక జీవితానికి సంబంధించిన కేసుల్లో కక్షిదారులు రాజీ పడే అవకాశం ఉంటుందని తెలిపారు. చిన్న చిన్న కేసులతో కక్షలు పెంచుకుని కోర్టుల చుట్టూ తిరుగుతూ సమయాన్ని వృథా చేసుకోవద్దని పేర్కొన్నారు. న్యాయశాఖ ఇచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. జిల్లాలోని పోలీస్ అధికారులు, కోర్టు విధులు నిర్వహించే కానిస్టేబుళ్లు, ఇతర పోలీస్ సిబ్బంది రాజీ పడ దగిన కేసులను గుర్తించి వారికి కౌన్సిలింగ్ ఇచ్చి, రాజీ పడేటట్లు అవగాహన కల్పించాలని పేర్కొన్నారు.

అమ్మ మాట, అంగన్వాడీ బాట



చిన్నారులతో అర్బన్ ప్రాజెక్ట్ సూపర్‌వైజర్

సూర్యాపేట అర్బన్ : పిల్లల్లో నైపుణ్యాన్ని పెంచడం, చదువుపై శ్రద్ధను కలిగించేందుకు ప్రభుత్వం అమ్మ మాట, అంగన్‌వాడీ బాట కార్యక్రమాన్ని చేపట్టిందని అంగన్‌వాడీ అర్బన్ ప్రాజెక్ట్ సూపర్‌వైజర్ గోనె నాగమణి అన్నారు. పట్టణంలోని బొడ్రాయి బజార్ సెక్టార్ ఓల్డ్ ఫైర్ స్టేషన్ పరిధిలోని అంగన్వాడీ సెంటర్‌లో శుక్రవారం నిర్వహించిన అమ్మమాట, అంగన్‌వాడీ బాట కార్యక్రమానికి ఆమె హాజరై మాట్లాడారు. అంగన్‌వాడీ బడిలో పిల్లలను చేర్పించాలని తల్లిదండ్రులకు సూచించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ పద్మ, హెల్పర్ విమల, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

బస్‌పాస్ ధరలు పెంచొద్దు



ఆర్టీసీ డిపో మేనేజర్‌కు వినతిపత్రం అందజేస్తున్న పీడీఎస్‌ఎఫ్ నాయకులు

సూర్యాపేట : ప్రభుత్వం విద్యార్థుల బస్‌పాస్ ధరలు పెంచే ఆలోచనను విరమించుకోవాలని పీడీఎస్‌ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ఆవుల నాగరాజు డిమాండ్ చేశారు. విద్యాసంస్థల సమయానికి, సంఖ్యకు అనుగుణంగా బస్ సర్వీసులను నడపాలని కోరుతూ శుక్రవారం సూర్యాపేట బస్ డిపో మేనేజర్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో శ్యామ్, సల్మాన్, నితిన్, రణధీర్, మధు, తదితరులు పాల్గొన్నారు.

బీరువా బహూకరణ



తుంగతుర్తిలోని జెడ్పీహెచ్‌ఎస్‌కు బీరువా బహూకరిస్తున్న పూర్వ విద్యార్థులు

తుంగతుర్తి : జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 1989 -1990 బ్యాచ్‌కి చెందిన పూర్వ విద్యార్థులు తాము చదువుకున్న పాఠశాలకు బీరువా బహూకరించారు. మే 11న ఆత్మీయ సమ్మేళనం ఏర్పాటు చేసుకుని అందులో తీసుకున్న నిర్ణయం ప్రకారం శుక్రవారం పాఠశాలకు బీరువా అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ప్రవీణ్ కుమార్, ఉపాధ్యాయ బృందం భాస్కర్, సహదేవ్, యాకయ్య, వి.కృష్ణవేణి, పి.రవికుమార్, రాజన్న, రాజు, నవీన్, ప్రసాద్, సునీత, ఎండీ ఇంతియాజ్, రవికుమార్, మధుకర్, ప్రవీణ్ కుమార్, పూర్వ విద్యార్థులు గుండగాని రాములు గౌడ్, గణేష్, గోపగాని వెంకన్న, పెండెం వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

భూ భారతితో పెండింగ్ సమస్యలు పరిష్కారం

నాగారం : ఎన్నో ఏళ్లుగా ఉన్న పెండింగ్ భూ సమస్యలు భూభారతి చట్టం ద్వారా పరిష్కరించుకోవచ్చని సూర్యాపేట ఆర్డీఓ వేణుమాధవరావు అన్నారు. శుక్రవారం ఈటూరు గ్రామంలో నిర్వహించిన భూభారతి రెవెన్యూ గ్రామసభను ఆకస్మికంగా సందర్శించి, రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూభారతి సదస్సుల్లో ప్రజల నుంచి స్వీకరించిన దరఖాస్తులను రెవెన్యూ సిబ్బంది వెంట వెంటనే ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని సూచించారు. రెవెన్యూ సదస్సులో రైతుల నుంచి 176 దరఖాస్తులను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ హరికిశోర్ శర్మ, డిప్యూటీ తహసీల్దార్ షాహిన్‌బేగం, ఆర్ఐ అల్లావుద్దీన్, ఎంపీఎస్‌ఓ చింతమల్ల రమేష్, సీనియర్ అసిస్టెంట్ షఫీ, మహేశ్వరి, రెవెన్యూ సిబ్బంది, రైతులు తదితరులు పాల్గొన్నారు.



ఈటూరులో భూ భారతి రికార్డులను పరిశీలిస్తున్న ఆర్డీఓ వేణుమాధవరావు

బంగారు భవితకు.. సర్కారు బడి

- ముమ్మరంగా కొనసాగుతున్న బడిబాట కార్యక్రమం
- ప్రైవేటు స్కూళ్లకు దీటుగా ప్రభుత్వ ఉపాధ్యాయుల ప్రచారం



సూర్యాపేటలో బడిబాట కార్యక్రమం నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు, స్థానికులు (ఫైల్)

తాళ్లగడ్డ(సూర్యాపేట) : ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయడమే లక్ష్యంగా ప్రభుత్వం బడిబాట కార్యక్రమానికి శ్రీకారం చేట్టుంది. ఈ ఏడాది విద్యాసంవత్సరంలో విద్యార్థుల నమోదును పెంచేందుకు ప్రభుత్వం ఈ నెల 6నుంచి 19 వరకు రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టాల్సిన కా ర్యక్రమాలను రూపొందించింది. ప్రస్తుతం బడిబాట కార్యక్రమాలు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. 12న పాఠశాలలు పునఃప్రారంభం అయ్యాయి. విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు అందించారు. అలాగే 80శాతం వరకు విద్యార్థులకు ఒక జత యూనిఫామ్ కూడా అందించారు.

అందరికీ శిక్షణ..

బడిబాట కార్యక్రమాల్లో భాగంగా బ్యానర్లు, కరపత్రాల కోసం అయ్యే ఖర్చు నిమిత్తం ప్రభుత్వం ఒక్కో బడికి వెయ్యి రూపాయల చొప్పున నిధులు మంజూరు చేసింది. విద్యార్థుల వికాసానికి అనుగుణంగా బోధన చేసేందుకు ఉపాధ్యాయులకు కూడా గత నెల శిక్షణ ఇచ్చారు. అంతే కాకుండా పిల్లలకు మెనూ ప్రకారం రుచికరమైన, నాణ్యమైన వంటలు చేసేందుకు వంటవారికి, పాఠశాలల్లో పరిశుభ్రమైన వాతావరణం కల్పించేందుకు శానిటరీ వర్కర్లకు కూడా ప్రత్యేకంగా శిక్షణ ఇస్తున్నారు.

విద్యార్థుల సంఖ్య పెంచేందుకు..

సూర్యాపేట పట్టణం, రూరల్ మండలంలో ప్రాథమిక పాఠశాలలు 45, ప్రాథమికోన్నత పాఠశాలు 10, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు16, కేజీబీవీ 1, ఆదర్శ పాఠశాల 1 ఉన్నాయి. ఈ పాఠశాలల్లో మొత్తం విద్యార్థులు 4584 మంది ఉన్నారు. ఇందులో బాలురు 2254, బాలికలు 2330 మంది ఉన్నారు. బడిబాటలో భాగంగా ఈ ఏడాది మరో వెయ్యికి పైచిలుకు విద్యార్థులను చేర్పేవిధంగా ఉపాధ్యాయులు ముమ్మరంగా అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నారు. మండలం నుంచి పీఎంశ్రీ పథకం మొదటి విడత కింద జెడ్పీహెచ్‌ఎస్ సూర్యాపేట, బాలికల సోషల్ వెల్ఫేర్ రెసిడెన్సియల్ స్కూల్ (టీఎస్‌డబ్ల్యూఆర్‌ఎస్) ఇమాంపేట ఎంపికయ్యాయి.

అపోహలు తొలగించేలా కార్యక్రమాలు..

ప్రభుత్వ స్కూళ్లలో నాణ్యమైన విద్య అందదనే అపోహ ప్రజల్లో ఉంది. దీంతో ఆర్థిక భారం అయినా ప్రైవేటు స్కూళ్ల వైపు మొగ్గు చూపుతున్నారు. ఈ క్రమంలోనే ప్రభుత్వ స్కూళ్లలో ఉండే నాణ్యత, విద్యాప్రమాణాల గురించి ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులు ప్రజలకు తెలియజేస్తున్నారు. గ్రామాల్లో ప్రతి ఇళ్లూ తిరుగుతూ ఐదేళ్లు నిండిన పిల్లలను బడిలో చేర్పించడమే గాక, చదువు మధ్యలో మానేసిన పిల్లలను గుర్తించి తిరిగి వారిని బడిలో చేర్పిస్తున్నారు.

ఉచితంగా పుస్తకాలు, యూనిఫామ్, నాణ్యమైన భోజనం..

ప్రస్తుత అవసరాలను దృష్టిలో ఉంచుకొని సర్కారు బడిలో చదువుకునే విద్యార్థులకు పోషకాహార లోపం కలగకుండా ఉదయం స్కూల్‌కు రాగానే రాగిజావ ఇస్తారు. అలాగే మధ్యాహ్న భోజనం ఏర్పాటు చేస్తారు. ఇందులో అన్ని రకాల పోషకాలు అందేలా మెనూ తయారు చేస్తారు. అలాగే యూనిఫాం, పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్స్ అందిస్తున్నారు.

సర్కారు బడిలో ప్రత్యేకం....

ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థుల నైపుణ్యాన్ని పెంపొందించేందుకు ప్రభుత్వం ఫౌండేషన్ లిటరసీ అండ్ న్యూమరసీ (ఎఫ్‌ఎల్‌ఎన్), లెర్నింగ్ ఇన్‌ప్రూవ్‌మెంట్ ప్రోగ్రాం (ఎల్‌ఐపీ), లక్ష్య వంటి పలు కార్యక్రమాలకు శ్రీకారం చుట్టింది. ఈ కార్యక్రమాలు విద్యార్థుల సామర్థ్యాన్ని బట్టి వారిలో రాయడం, చదవడంలో నైపుణ్యాలు మెరుగుపరచుకునేందుకు దోహదపడతాయి. ఎఫ్‌ఎల్‌ఎన్ ద్వారా 1 నుంచి 5వ తరగతి విద్యార్థులలో స్ట్రగులర్స్ (చదువులో వెనకబడిన విద్యార్థులు)కు, ఎల్‌ఐపీ ద్వారా హైస్కూల్‌లోని 6 నుంచి 9వ తరగతి విద్యార్థులకు చదవడం, రాయడం, గణితంలో మెలకువలు నేర్పిస్తారు. లక్ష్య కార్యక్రమం ద్వారా 10వ తరగతి విద్యార్థుల ఉత్తీర్ణత శాతం పెంచేందుకు విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తారు.

ప్రభుత్వ బడిలోనే మెరుగైన విద్య



విద్యార్థుల్లో కనీస సామర్థ్యాలను పెంపొందించేందుకు ఎఫ్‌ఎల్‌ఎన్, ఎల్‌ఐపీ కార్యక్రమాల అమలు కోసం ప్రభుత్వం అన్ని స్థాయిల ఉపాధ్యాయులకు, విద్యాశాఖాధికారులకు ప్రత్యేక శిక్షణ కార్యక్రమాలు నిర్వహించింది. డిజిటల్ బోధనలో ప్రభుత్వ పాఠశాలలే ముందున్నాయి. ఐఎఫ్‌పీ బోర్డులతో బోధించడమే దీనికి సాక్ష్యం. వెనకబడిన విద్యార్థుల్లో సామర్థ్యాలను పెంపొందించుటకు ఏఐ టెక్నాలజీని రూపొందించి, ప్రభుత్వం ప్రతీ పాఠశాలకు ఐదు కంప్యూటర్లను అందిస్తుంది. ఈ సౌకర్యాలు ఉన్న ప్రభుత్వ పాఠశాలలను ఉపయోగించాలి.

– శేషగాని శ్రీనివాస్ గౌడ్, ఎంఈఓ

మంచి అవకాశాలు ఉంటాయి



ప్రభుత్వ పాఠశాలలో చేరితే ఏడాదికి రూ.60 వేల వరకు మిగులుతుంది. అది పైచదువులకు ఉపయోగపడుతుంది. అలాగే ప్రభుత్వ పాఠశాలలో 8వ తరగతి విద్యార్థులకు ఎన్‌ఎంఎంఎస్ పరీక్ష ద్వారా నాలుగేళ్లపాటు ఏడాదికి రూ.12 వేలు స్కాలర్‌షిప్ వస్తుంది. ఐఐటీలో అవకాశాలు ఉంటాయి. ఈ విషయాలపై బడిబాట కార్యక్రమం ద్వారా తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తున్నాం. ఈసారి విద్యార్థుల సంఖ్య పెరిగే అవకాశం ఉంది.

– ఉదయశ్రీ, ప్రభుత్వ హైస్కూల్-2, హెచ్‌ఎం

హామీలను అమలు చేయాలి



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న తెలంగాణ ఉద్యమకారులు

సూర్యాపేట : తెలంగాణ ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలుచేయాలని సూర్యాపేట జిల్లాకు చెందిన తెలంగాణ ఉద్యమకారులు ప్రభుత్వాన్ని కోరారు. శుక్రవారం కలెక్టర్‌కు వినతిపత్రం అందజేసి మాట్లాడారు. సకల జనులు నిస్వార్థంగా దశాబ్దాల పాటు చేసిన పోరాటాల ఫలితంగానే తెలంగాణ రాష్ట్రం ఏర్పడిందని అన్నారు. తొలి దశ, మలిదశ ఉద్యమాలలో అనేక మంది ప్రాణాలు కోల్పోయారని తెలిపారు. తెలంగాణ ఉద్యమకారులకు ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చి, ఉద్యమకారులు ఆత్మగౌరవంతో బతకడానికి తోడ్పడాలని కోరారు. ఈ కార్యక్రమంలో తొలి, మలిదశ ఉద్యమకారులు కుంట్ల ధర్మార్జున్, మండాది డేవిడ్ కుమార్, రాయపూడి వెంకటేశ్వరరావు, తండు నాగరాజు, గట్ల రమా శంకర్, సామ అంజిరెడ్డి, బొల్లె వెంకన్న, కిరణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాలి



కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్‌కు వినతిపత్రం అందిస్తున్న యువజన సంఘం నాయకులు

భానుపురి : జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయడంతోపాటు ప్రైవేటు పాఠశాలలు వసూలు చేస్తున్న అధిక ఫీజులను అరికట్టాలని తెలంగాణ యువజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అనంతుల మధు అన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్‌ను కలిసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. అనుమతులు లేకుండా నిర్వహిస్తున్న ప్రైవేటు పాఠశాలలపై చర్యలు తీసుకోవాలన్నారు. విద్యాహక్కు చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలని కోరారు. అధిక ధరలకు బుక్స్, స్టేషనరీ విక్రయిస్తున్న ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలపై కఠినంగా వ్యవహరించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు బాషిపంగు సునీల్, తెలంగాణ యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు పోరెళ్ల విప్లవ్ కుమార్, బంటు సందీప్, శిలోజు గౌతమ్ చారి, శివ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లోనే గుణాత్మక విద్య



అర్వపల్లి : జాజిరెడ్డిగూడెం జెడ్పీహెచ్‌ఎస్‌లో విద్యార్థులకు అడ్మిషన్లు ఇస్తున్న ఉపాధ్యాయులు

అర్వపల్లి : ప్రభుత్వ పాఠశాలల్లోనే గుణాత్మక విద్య అందుతుందని ఎంఈఓ బి.బాలునాయక్ అన్నారు. జాజిరెడ్డిగూడెం పీఎస్ నుంచి జెడ్పీహెచ్‌ఎస్‌లో 6వ తరగతి నందు కొత్తగా చేరుతున్న 8 మంది విద్యార్థులకు శుక్రవారం అడ్మిషన్లు ఇచ్చారు. ఈ సందర్భంగా రెండు పాఠశాలల ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లోనే ఉత్తమ ఫలితాలు వస్తున్నాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో పీఎస్ హెచ్‌ఎం జి.ఇందిర పాల్గొన్నారు.

ఉపాధ్యాయ బృందానికి అభినందన

జాజిరెడ్డిగూడెం మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాల జిల్లా ఉత్తమ పాఠశాలగా ఎంపికై కలెక్టర్ నుంచి అవార్డు పొందడంతో శుక్రవారం ఎంఈఓ బాలునాయక్ పాఠశాల హెచ్‌ఎం ఇందిర, ఉపాధ్యాయ బృందాన్ని అభినందించారు. ఈ పాఠశాలలో ఉత్తమ విద్యాబోధన, దాతల సహకారంతో అభివృద్ధి పనులు చేపట్టి జిల్లాకు ఆదర్శంగా నిలవడం సంతోషమైన విషయమన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు సీహెచ్. నాగరాజు, సీహెచ్. వెంకటేశ్వర్లు, ఆర్. నాగరాజు, వి. యాదగిరి, జి. మంజుల, బి. రమేష్, కె. రమేష్ పాల్గొన్నారు.

తిరుమలగిరిలో 100 అడ్మిషన్లు పూర్తి

తిరుమలగిరి : తిరుమలగిరి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నూతనంగా 100 అడ్మిషన్లు వచ్చినట్లు హెచ్‌ఎం దామెర శ్రీనివాస్ తెలిపారు. శుక్రవారం ఉపాధ్యాయులతో కలిసి బడిబాట కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. పాఠశాలలోని ఉపాధ్యాయులు నాలుగు బృందాలుగా ఏర్పడి విద్యార్థుల తల్లిదండ్రులకు ప్రభుత్వ పాఠశాలలపై అవగాహన కల్పించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు సోమయ్య, ఉపేంద్ర, సత్తిరెడ్డి, లక్ష్మణ్, వెంకన్న, జానయ్య తదితరులు పాల్గొన్నారు.



తిరుమలగిరి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బడిబాటలో పాల్గొన్న ఉపాధ్యాయులు

దోమలు వృద్ధి చెందకుండా చూసుకోవాలి

- మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్



మురుగు కాలువల్లో ఆయిల్ బాల్స్ వేస్తున్న మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్, సిబ్బంది

సూర్యాపేట : వర్షాకాలం దృష్ట్యా దోమలు వృద్ధి చెందకుండా చూసుకోవాలని మున్సిపల్ కమిషనర్ బి.శ్రీనివాస్ అన్నారు. 100 రోజుల ప్రణాళికలో భాగంగా 12వ రోజు శుక్రవారం పట్టణంలోని 12వ వార్డు పిల్లలమర్రిలో సమావేశం నిర్వహించి మాట్లాడారు. పట్టణ ప్రజలు తమ ఇళ్ల పరిసరాలలో మురుగు నీరు నిల్వ లేకుండా చేసుకోవాలన్నారు. మురుగు నీటితో దోమలు వృద్ధి చెందే అవకాశం ఉందని తెలిపారు. ఎప్పటికప్పుడు ఇళ్ల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. పలు ప్రాంతాల్లో ఉన్న మురుగు కాలువల్లో దోమలు వృద్ధి చెందకుండా ఆయిల్ బాల్స్ వేయించారు. వర్షాకాలం దృష్ట్యా శిథిలావస్థలో ఉండి కూలిపోవడానికి సిద్ధంగా ఉన్న ఇళ్లలో నివసించకుండా సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలని ప్రజలకు సూచించారు. శిథిలావస్థలో కూలిపోవడానికి సిద్ధంగా ఉన్న భవనాల వారికి నోటీసులు జారీచేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ డీఈ సత్యారావు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ సారగండ్ల శ్రీనివాస్, టీఎంసీ శ్వేత, వార్డ్ అధికారి నరేష్, ఎన్విరాన్‌మెంట్ ఇంజనీర్ శివప్రసాద్, వార్డు అధికారి మచ్చ రాంబాబు, మహిళా సంఘం సభ్యులు పాల్గొన్నారు.

30వరకు సన్నబియ్యం పంపిణీ

తిరుమలగిరి : ఈ నెల 30వ తేదీ వరకు చౌక ధరల దుకాణం ద్వారా సన్నబియ్యం పంపిణీ జరుగుతుందని తిరుమలగిరి తహసీల్దార్ హరిప్రసాద్ తెలిపారు. శుక్రవారం మండల కేంద్రంలోని రేషన్ షాపు నెం.1, అంగన్‌వాడీ కేంద్రాలను తనిఖీ చేశారు. రేషన్ షాపులో స్టాక్ రిజిస్టర్‌ను, బియ్యం నాణ్యతను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ జాన్‌మహ్మద్, ఆర్ఐలు జార్జిరెడ్డి, సుజిత్‌రెడ్డి, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

అనుమతులు లేని పాఠశాలలను సీజ్ చేయాలి

సూర్యాపేటటౌన్ : జిల్లాలో అనుమతులు లేని పాఠశాలలను సీజ్ చేయాలని పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు సింహాద్రి అన్నారు. శుక్రవారం పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో డీఈఓకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు మందడి శ్రీధర్, దూదిపాల ప్రవీణ్, సాయి తదితరులు పాల్గొన్నారు.

ఆత్మీయ భరోసా అందించాలి

పెన్‌పహాడ్ : ఉపాధి హామీ మహిళా కూలీలకు ఆత్మీయ భరోసా అందించాలని సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యుడు రణపంగ కృష్ణ అన్నారు. శుక్రవారం లింగాలలో ఉపాధి కూలీలతో మాట్లాడారు. ఎన్నికల హామీల్లో భాగంగా ఆత్మీయ భరోసా పథకాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు.

20 వరకు రైతు భరోసా దరఖాస్తుల స్వీకరణ



చివ్వెంల : దరఖాస్తులు స్వీకరిస్తున్న అధికారి

తాళ్లగడ్డ (సూర్యాపేట) : కొత్తగా పట్టాదారు పాస్‌పుస్తకం వచ్చిన రైతులు రైతుభరోసాకు దరఖాస్తు చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి బి. కృష్ణ సందీప్ శుక్రవారం ప్రకటనలో తెలిపారు. 2025 జూన్ 5లోపు పట్టాదారు పాస్‌పుస్తకం వచ్చిన రైతులు పథకానికి అర్హులని తెలిపారు. రైతు భరోసా దరఖాస్తు ఫారం, పట్టాదారు పాస్‌పుస్తకం, ఆధార్ కార్డ్, బ్యాంకు అకౌంట్ పుస్తకం జిరాక్స్‌లను తమ క్లస్టర్ వ్యవసాయ విస్తరణ అధికారులకు అందజేయాలని సూచించారు. ఈ నెల 20వరకు రైతు భరోసా పథకానికి దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. గతంలో రైతు భరోసా పథకం ద్వారా డబ్బులు వచ్చిన రైతులు ఎటువంటి దరఖాస్తు చేసుకోవాల్సిన అవసరం లేదని పేర్కొన్నారు.

పెన్‌పహాడ్ : వానాకాలం 2025లో కొత్తగా పట్టాలు చేసుకున్న రైతులు రైతు భరోసాకు దరఖాస్తులు చేసుకోవాలని ఏఓ అనిల్‌కుమార్ శుక్రవారం తెలిపారు. రైతులు రైతు భరోసా దరఖాస్తు ఫారం, పట్టాదారు పాసుపుస్తకం, ఆధార్ కార్డు, బ్యాంక్ అకౌంట్ జిరాక్స్‌లు ఏఈఓలకు అందజేయాలని సూచించారు. ఈ నెల 20వ తేదీలోపు దరఖాస్తులు చేసుకోవాలని పేర్కొన్నారు.

చివ్వెంల : రైతులు రైతు భరోసా పథకానికి దరఖాస్తులు చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి వెంకటేశ్వర్లు తెలిపారు. శుక్రవారం మండల కేంద్రంలోని రైతు వేదికలో పలువురు రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరించి మాట్లాడారు. ఈ నెల 20వ తేదీలోపు దరఖాస్తులు అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఈఓలు వెంకట్ రెడ్డి, శైలజ, మానస, ప్రియాంక తదితరులు పాల్గొన్నారు.


యోగా డే సంబరాలు విజయవంతం చేయాలి



సమావేశంలో పాల్గొన్న యోగా సాధకులు

సూర్యాపేట : ఈ నెల 21న నిర్వహించే యోగా డే సంబరాలను విజయవంతం చేయాలని యోగా గురువు చాడ పాపిరెడ్డి అన్నారు. శుక్రవారం పట్టణంలోని ఉన్నత యోగా శిక్షణ కేంద్రంలో సాధకులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. అంతర్జాతీయ యోగా డే ప్రకటించి 10 ఏళ్లు పూర్తయిన సందర్భంగా ప్రధాని నరేంద్ర మోదీ పిలుపుమేరకు వన్ ఎర్త్ వన్ హెల్త్ స్లోగన్‌తో యోగా డే సంబరాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ నెల 15న బ్రాహ్మణ కల్యాణ మండపంలో ఉదయం 5 గంటల నుంచి 8 గంటల వరకు జరిగే సన్నాహక యోగా సంబరాలలో ప్రతి ఒక్కరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో యోగా సాధకులు వి.లింగయ్య, గోరంట్ల శ్రీనివాస్, మల్లారెడ్డి, కళ్యాణి, జ్యోతి, సుధాకర్, సుదర్శన్ రెడ్డి, మమత, మంజుల, సుజాత, రజిత, సరిత, వెంకట్ రెడ్డి, శ్రీనివాసరెడ్డి, మురళీకృష్ణ, చంద్రశేఖర్, లింగయ్య, సైదులు పాల్గొన్నారు.

నూతనకల్లు : యోగాతో సంపూర్ణ ఆరోగ్యాన్ని పొందవచ్చని యోగా గురువు సుదర్శన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యసిబ్బందికి యోగా డే సందర్భంగా యోగాసనాలు నేర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రతి ఒక్కరూ యోగసనాలను ప్రాక్టీస్ చేయడం ద్వారా అనేక వ్యాధులకు దూరంగా ఉండవచ్చని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మండల వైద్యాధికారి అశ్రీత రెడ్డి, సందీప్, సీహెచ్‌ఓ చరణ్‌నాయక్, వైద్యసిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



నూతనకల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో యోగసనాలు వేస్తున్న వైద్యసిబ్బంది, రోగులు

క్షయవ్యాధి నిర్ధారణ శిబిరం

తుంగతుర్తి : క్షయ వ్యాధి నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని డాక్టర్ లింగమూర్తి అన్నారు. శుక్రవారం తుంగతుర్తి మండల పరిధిలోని గానుగబండ గ్రామంలో క్షయ వ్యాధి నిర్మూలనపై అవగాహన కల్పించి మాట్లాడారు. నిక్షయ్ శివిర్ 2.0 క్యాంపు ద్వారా గ్రామంలో 26 మంది నుంచి నమూనాలను సేకరించి సీబీఎన్, ఏఏటీ ల్యాబ్‌కు పంపించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఈఓ రవికుమార్, వైద్యసిబ్బంది కిరణ్ కుమార్, గాజుల సోమన్న, యాదగిరి, నరసింహాచారి, ఏఎన్‌ఎం నాగలక్ష్మి, ల్యాబ్ టెక్నీషియన్ వెంకట్, ఆశా రమా, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు సామూహిక అక్షరాభ్యాసం



అర్వపల్లి : రామన్నగూడెం ప్రాథమిక పాఠశాలలో పిల్లలతో అక్షరాభ్యాసం చేయిస్తున్న ఎంఎన్‌ఓ



తుంగతుర్తి : వెంపటి ప్రాథమిక పాఠశాలలో..



తిరుమలగిరిలో చిన్నారులకు అక్షరాభ్యాసం చేయిస్తున్న మార్కెట్ చైర్‌పర్సన్ చామంతి

అర్వపల్లి : బడిబాటలో భాగంగా వివిధ పాఠశాలల్లో శుక్రవారం అక్షరాభ్యాసం కార్యక్రమాన్ని నిర్వహించారు. జాజిరెడ్డిగూడెం, అడివెంల తదితర పాఠశాలల్లో ఎంఈఓ బాలునాయక్, రామన్నగూడెం తదితర పీఎస్‌లలో ఎంఎన్‌ఓ కుంభం ప్రభాకర్ పిల్లలచే అక్షరాభ్యాసం చేయించారు. కార్యక్రమాల్లో ఐసీడీఎస్ సీడీపీఓ శ్రీజ, హెచ్‌ఎంలు సీహెచ్. ధర్మయ్య, ఇందిర, ఎల్. యాదమ్మ, ఉపాధ్యాయులు కృష్ణయ్య, విజయలక్ష్మి, కరుణ, నాగరాజు, వెంకటేశ్వర్లు, యాదగిరి, మంజుల, నాగరాజు, రమేష్, అంజమ్మ, భాగ్యమ్మ, ఆయా గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

విద్యార్థులు ఇష్టపడి చదవాలి

తిరుమలగిరి : ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందుతుందని, విద్యార్థులు ఇష్టపడి చదవాలని తిరుమలగిరి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ ఎల్సోజు చామంతి నరేష్ అన్నారు. ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో ఎల్‌కేజీ, యూకేజీ పిల్లలకు నిర్వహించిన సామూహిక అక్షరాభ్యాసంలో పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ పాలెపు చంద్రశేఖర్, తహసీల్దార్ హరిప్రసాద్, ఎంపీడీఓ లాజర్, మండల విద్యాధికారి ఐ.శాంతయ్య, దామెర శ్రీనివాస్, కొంపెల్లి ఉమ, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కె.అశోక్‌రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నూతనకల్లు : పెద్ద నెమిల ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయులు విద్యార్థులకు శుక్రవారం సామూహిక అక్షరాభ్యాసం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు చంద్రశేఖర్‌రెడ్డి, రజిత, రవీందర్, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

నాగారం : మండలంలోని నాగారం, నాగారంబంగ్లా ప్రాథమిక పాఠశాలల్లో బడిబాట కార్యక్రమంలో భాగంగా శుక్రవారం విద్యార్థులతో సామూహిక అక్షరాభ్యాసం నిర్వహించారు. ప్రాథమిక పాఠశాలల్లో నూతనంగా చేరిన 1వ తరగతి విద్యార్థులతో కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు జ్ఞానేశ్వరచారి, ఉపాధ్యాయులు సామూహిక అక్షరాభ్యాసం చేయించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు రాందాస్ నాయక్, ఉమామహేశ్వరి, ఉపాధ్యాయులు వీరేష్, కమల, నిర్మల, రమేష్, మీనా, ఐఈఆర్పీ బాషా, సీఆర్పీ హరిప్రసాద్ పాల్గొన్నారు.

మద్దిరాల : గోరెంట్లలోని అంగన్‌వాడీ కేంద్రం చిన్నారులకు శుక్రవారం సామూహిక అక్షరాభ్యాసం నిర్వహించారు. కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి నాగయ్య, ఎంపీడీఓ సత్యనారాయణ, ఎంఈఓ కాట్ల రవికుమార్ ముఖ్య అతిథిగా పాల్గొని చిన్నారులచేత అక్షరభ్యాసం చేయించారు. అనంతరం గ్రామంలోని వన నర్సరీతోపాటు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు.

తుంగతుర్తి : ప్రభుత్వ బడుల్లో ప్రైవేటు పాఠశాలలకు దీటుగా విద్యాబోధన ఉంటుందని, తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని హెచ్‌ఎం చిత్తలూరి వెంకట్రామనరసమ్మ అన్నారు. శుక్రవారం వెంపటి ప్రాథమిక పాఠశాలలో ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు సామూహిక అక్షరాభ్యాసం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాలకుర్తి ఎల్లయ్య, మల్లెపాక రవీందర్, గుండ్ల ఆంజనేయులు, గట్టు మాధవి, బండారు భవాని, జీడి అనిల్ కుమార్, మిట్టగడుపుల విక్రమ్, మాలోత్ కృష్ణ, శిలోజు రమాదేవి, తదితరులు పాల్గొన్నారు.

ఆత్మకూర్(ఎస్) : మండల పరిధిలోని పాతర్లపహాడ్, తుమ్మలపెన్‌పహాడ్ ప్రాథమిక పాఠశాలల్లో విద్యార్థులకు శుక్రవారం సామూహిక అక్షరాభ్యాసం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల విద్యాధికారి ధారాసింగ్ మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య అందుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాతర్లపహాడ్ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు అంజయ్య, ఉపాధ్యాయులు కరుణాకర్ రెడ్డి, జ్యోతి, సుధాకర్, గిలకత్తుల సైదులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.



నాగారంలోని ప్రాథమిక పాఠశాలలో..



నూతనకల్ : పెద్దనెమిల ప్రాథమిక పాఠశాలలో..



ఆత్మకూర్(ఎస్) : పాతర్లపహాడ్‌లో..



మద్దిరాల : గోరెంట్ల అంగన్‌వాడీ కేంద్రంలో..



అర్వపల్లి : జాజిరెడ్డిగూడెం పాఠశాలలో..